డైట్‌లో పోస్టుల భర్తీకి వినతి

డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న లెక్షలర్లు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని డైట్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డికి డైట్ లెక్చరర్స్ మడితాటి నరసింహారెడ్డి, వై.సి రెడ్డప్పరెడ్డి విన్నవించారు. సోమవారం ఉదయం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాయచోటిలోని డైట్‌లో మొత్తం 29 పోస్టులు ఉండగా కేవలం 11 మాత్రమే అధ్యాపకులు ఉన్నారని, 18 అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత వల్ల చాత్రోపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందడం లేదన్నారు. వెంటనే అధ్యాపకుల భర్తీకి చర్యలు తీసుకొని చాత్రోపాధ్యాయులకు న్యాయం చేయాలని డైరెక్టర్‌కు విన్నవించారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

- నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాష్ట్రంలో అమల్లో ఉన్న ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటల పని దినంగా మారుస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. పని గంటల పెంపు నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం శాసనసభ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ నిర్ణయించడం దారుణమని పేర్కొన్నారు. 1920లో మహాత్మా గాంధీతో పాటు పలు కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశంలో ఎనిమిది గంటల అమలవుతోందని తెలిపారు. దేశంలో 1948లో పారిశ్రామిక చట్టం అమలులోకి వచ్చినప్పటికీ ఎనిమిది గంటల పని దినం అనేది కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతటి చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడం అత్యంత హేయమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహమ య్యాయి అనడానికి ఇదే మంచి ఉదాహరణ అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పెంచిన 13 గంటల పని దినాన్ని తిరిగి ఎనిమిది గంటల పని దినంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జయన్న, చెన్నయ్య, కృష్ణతో పాటు పలువురు కార్మికుల పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం : జెసి

ప్రజాశక్తి- రాయచోటి

పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో, నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జెసి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జాయింట్ కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

హైకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల నిరసన

కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - రాయచోటి

వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు ఏడాదిలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పని గంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయ వాదులందరూ ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి గల కారణాలను తెలియజేసిన అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి బాష మాట్లాడుతూ ఇప్పటివరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరు కాగానే న్యాయవాదులందరూ, న్యాయ మూర్తులతో కలిసి చనిపోయిన న్యాయవాదులకు సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటినుంచో వస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందన్నారు. హైకోర్టు సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని చనిపోయిన న్యాయవాదుల సంతాప కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు కాకుండా న్యాయవాదులు, న్యాయమూర్తులు అందుబాటులో లేని సాయంత్రం జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్క్యులర్ ఇవ్వడం బాధాకరమని పేర్కొన్నారు. తక్షణం వెనక్కి తీసుకోవాలని సంతాప కార్యక్రమాన్ని యథా ప్రకారం కోర్టుల్లో న్యాయవాదులు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఉన్న సంస్కృతిని రద్దు చేయడం అంటే న్యాయవాదులందరినీ అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పునరాలోచన చేసి పాత సంస్కృతిని పునరుద్ధరణ చేయాలని ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మదనపల్లె ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం బాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరునెలల్లోనే మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తామని, మదనపల్లెలో జరిగిన 'మినీ మహానాడు'లోను, బెంగళూరు బస్టాండ్ వద్ద జరిగిన ఎన్నికల బహిరంగ సభలోనూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వగా, యువగళం పాదయాత్రలో భాగంగా పీలేరు, మదనపల్లెల్లో జరిగిన సభల్లో మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి అధికారం చేపట్టి, 16 నెలలు దాటిపోయిందని, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఇప్పటికే రెండుసార్లు అసెంబ్లీలో మదనపల్లె జిల్లా కోసం విజ్ఞప్తి చేశారని, అయినా సిఎం కానీ, మంత్రి లోకేష్ కానీ మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇవ్వలేదని, ఈ పరిణామాలు మదనపల్లె ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. నవంబర్-డిసెంబర్ మాసాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఆతర్వాత జనాభా లెక్కల సేకరణ ప్రారంభమవుతుందని. ఆ సమయంలో జిల్లాల ఏర్పాటుకు అవకాశం ఉండదు చెప్పారు. ప్రస్తుతం జరుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుకు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు విషయంలో ఇంకా తాత్సారం చేస్తే, మరో పోరాటానికి మదనపల్లె ప్రజలు సమరశంఖం పూరిస్తారని హెచ్చరించారు. మదనపల్లె ప్రజలు అగ్రహించి, ఆందోళనకు పూనుకోక ముందే మదనపల్లె జిల్లాను ప్రకటించి, చంద్రబాబు, లోకేష్ బాబులు మదనపల్లె ప్రజల కృతజ్ఞతలు అందుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రతినిధులు నీరుగట్టి రమణ, దేగాని రమణ, తెట్టు శ్రీనివాసులు, సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, తలారి కృష్ణ, బురుజు రెడ్డిప్రసాద్, గూడుపల్లి గంగులప్ప, సయ్యద్‌బాషా, చంద్ర పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ సాయిశ్రీ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ సాయిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని చారావాండ్లపల్లిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలో జీవక్రియలు అన్ని సక్రమంగా జరిగి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం సమపాళ్లలో తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి రోజు యోగా చేయడం, వాకింగ్, తగిన మోతాదులో నీరు తాగడం, ఆకు కూరలు తినడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఉప్పు, కారం, నూనె, చక్కర, మైదా వాడకంను తగ్గించాలని సూచించారు. అనంతరం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సిహెచ్ఒ అరుణ, సూపర్‌వైజర్లు బాహుద్దీన్, భానుబి, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, సిహెచ్ఒ సౌజన్య, పుష్పావతి, రెడ్డెమ్మ, ఎఎన్ఎంలు నిర్మల, భారతమ్మ, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

తుమ్మాని వంకకు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి- సుండుపల్లి

మండలంలోని పత్తివాండ్లపల్లె సమీపంలో ఉన్న తుమ్మానివంకకు రక్షణ గోడ నిర్మించి పత్తివాండ్లపల్లె ప్రజల ప్రాణాలు కాపాడాలని అన్నమయ్య మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జెసి ఆదర్శ్‌రంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతుఊ పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల తుమ్మాని వంకకు వరదలు వచ్చి రక్షణగా ఉన్న మట్టికట్ట(కరకట్ట)కు గండిపడిందని, ఫలితంగా లోతట్టు గ్రామమైన పత్తివాండ్ల పల్లెలోని గృహాల్లోకి వరద నీరు చేరి ప్రజలకు ఆస్తినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కోళ్ళు వరదలో కొట్టుకు పోయాయని తెలిపారు. ఆ రోజు రాత్రి అంతా ప్రజలంతా బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్ళీ గ్రామంలోకి వంకనీరు ప్రవహిస్తుందని ఆయన తెలిపారు. వరదనీరు వ్యవసాయ భూములు మీద పడి పంటలు కొట్టుకు పోయి రైతులు నష్టపోయారని తెలిపారు. సుండుపల్లె నుంచి పత్తివాళ్లపల్లికి వచ్చే మార్గంలో ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో గ్రామ ప్రజలకు బయటి ప్రపంచానికి రాకపోకలు లేవని ఆయన తెలిపారు. వంకనీరు వ్యవసాయ భూముల్లో ప్రవహిస్తూ పంటలను నాశనం చేస్తోందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తుమ్మాని వంకలోని కంప చెట్లను తొలగించాలని కోరారు. రోడ్డు, బ్రిడ్జిలకు మరమ్మతులు వెంటనే చేసి ప్రజల అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జెసి స్పందిస్తూ సమస్య తమ దృష్టిలో ఉందని, వరద నష్టనివారణ చర్యలు తీసుకొంటామని తెలిపారు.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా నిలుస్తున్న
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక
44 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని
నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
శుభ సందర్భంగా 'ప్రజాశక్తి'
యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు, పాఠకులకు,
అభిమానులకు ఇవే మా హార్థిక శుభాకాంక్షలు.



వి.రవితేజ
లైఫ్‌కేర్ మెడికల్,
చిన్నమండెం.

శంకర్ రెడ్డి
ప్రధమ చికిత్స కేంద్రం,
చిన్నమండెం.

స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి పీలేరులో క్యూఆర్ కోడ్ డిజిటల్ ట్రాకింగ్ సాలభ్యంతో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని పలు చౌక దుకాణాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ స్మార్ట్ కార్డులపై ఎలాంటి రాజకీయ నాయకుల ఫొటోలు ముద్రించకుండా కేవలం ప్రభుత్వ చిహ్నం, కుటుంబ సభ్యుల ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉండే స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2025 జూన్ 30 వరకు అప్రూవల్ అయిన రేషన్ కార్డులు మండలంలో 21,009 మంజూరయ్యాయని, వాటిని మండలంలోని 56 చౌక దుకాణాలకు అందజేశామన్నారు. దాని ప్రకారం కార్డుదారులు తమ గ్రామ సమీపంలో ఉన్న రేషన్ షాపుల్లో తీసుకోవాలని తెలియజేశారు. 2025 డిసెంబర్ తర్వాత అప్రూవల్ అయిన రేషన్ కార్డులు త్వరలో మిగతా వారికి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి, పీలేరు ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనాథ్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి, షామియాన జయన్న, గుర్రం నరేష్ కుమార్‌రెడ్డి, బోడుమల్లువారిపల్లి సూరి, సీనియర్ నాయకులు జాఫర్, రెడ్డి ముని, మైనార్టీ నాయకులు కెజిఎన్ రెడ్డి బాష, షౌకత్, చాన్ బాష, నౌలాక్, ఖాదర్, ప్రసాద్, అంజి, కూటమి శ్రేణులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డికి వినతిపత్రం ఇస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని సచివాలయం సంబంధించిన వాలంటీర్లను తిరిగి వీధిలోకి తీసుకోవాలని ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి సునీల్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్లకు ఇస్తామన్న గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లు బి.సాయి కృష్ణ, శివకోటి, సురేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్, సుధీర్ కుమార్, మక్షుద్‌బాషా, అయూబ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ పూల వెంకటరమణ

క్రీడలతో అల్జీమర్స్ వ్యాధికి చెక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రీడలతో ఆల్జీమర్స్ వ్యాధికి చెక్ పెట్టవచ్చని డాక్టర్ పూల వెంకటరమణ తెలిపారు. సోమవారం పట్టణంలోని వెలుగు వృద్ధాశ్రమంలో ప్రపంచ అల్జీమర్స్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత డిఎంహెచ్ఒ డాక్టర్ పూల వెంకటరమణ హాజరై మాట్లాడారు. 'అల్జీమర్స్' వ్యాధి నాలుగు దశలలో ఉంటుందన్నారు. మెదడు కణాలు దెబ్బతినడం ప్రారంభమవుతాయని, ఇది ఒక దీర్ఘకాలిక న్యూరో డిజనరేటివ్ వ్యాధి అన్నారు. ఇది నెమ్మదిగా ప్రారంభమై కాలం గడిచే కొద్ది తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని, సాధారణంగా 65 ఏళ్ల పైబడిన వారిలో కనిపించే వ్యాధి అన్నారు. జ్ఞాపకశక్తి మందగించడం దీని ముఖ్య లక్షణమని వివరించారు. అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న వారు తమ జీవితాల్లో ముఖ్యమైన వ్యక్తులను మరిచిపోతారని, వ్యక్తిత్వ మార్పులకు గురవుతారని, మెదడు కణాలు క్షీణించి జ్ఞాపకశక్తి, మానసిక పనితీరులో మార్పులు వస్తాయని వివరించారు. దీని సమస్య తగ్గించుకోవడానికి శారీరకంగా, మానసికంగా ముఖ్యంగా చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడటం వల్ల అల్జీమర్స్ వ్యాధిని కొంతవరకు నివారించవచ్చన్నారు. దీనికి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఉండాలని వివరించారు. అనంతరం వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మతిమరుపు అనేది లైఫ్ స్టైల్ ఛేంజెస్ ద్వారా తగ్గించుకోవచ్చునని, శరీరానికి ఆహారం ఏ విధంగా అవసరమో, మెదడకు కూడా తగిన విశ్రాంతి, యోగ, మెడిటేషన్ అవసరమన్నారు. దీని ద్వారా మతిమరుపును తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, సోషల్ వర్కర్ ఎం.గీత, వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది వృద్ధులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు 'మిట్స్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశకి- మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు జెఎన్‌టియు విశ్వవిద్యాలయ పురుషులు, మహిళా కబడ్డీ జట్లలో చోటు దక్కించుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం విద్యార్థి పి. ప్రశాంత్, ఎంసిఎ రెండవ సంవత్సరం విద్యార్థి ఎం. వెంకట సాయి దిలీప్ పురుషుల జట్టులో, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం విద్యార్థిని పి. ఇందు మహిళా జట్టులో ఎంపికైనట్లు మిట్స్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ జట్లు అక్టోబర్ 4 నుండి 7 వరకు కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీ, బెల్గావి వేదికగా నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొననున్నాయన్నారు. ఎంపికైన విద్యార్థులను మిట్స్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మాట్లాడుతున్న రూటా రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి : 'రూటా'

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన కోరికలైన పెండింగ్ డిఎలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఐఆర్ కూడా ప్రకటించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ హాసిం డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సంఘ కార్యాలయంలో రూట ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రూటా కో- ఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ఉర్దూ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించి రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. పట్టణ, నగర శివారులలో నూతనంగా ఏర్పాటు అయిన కాలనీలలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను స్థాపించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు సభాతుర్ రెహమాన్ మాట్లాడుతూ అధ్యాపకుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని డిప్యూటేషన్ ప్రాతిపదికన అర్హులైన ఉపాధ్యాయులతో వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రూట రాష్ట్ర నేతలు అసదుల్లాబాష, జిల్లా నేతలు జాఫర్ ఉద్దీన్‌తోపాటు పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసుల్లో విచారణకు సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా బిసిసెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం ఫర్వీన్ తాజ్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించి ప్రజల పక్షాన పోరాడినందుకు అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. నిజమైన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలుగా నాలుగేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి వైసిపి బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేసి విముక్తి కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెనాల్టీ సకాలంలో చెల్లించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - గాలివీడు

వాహనాలకు విధించిన పెనాల్టీని సకాలంలో చెల్లించాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడికి లైసెన్స్ తప్పరిసరని పేర్కొన్నారు. వాహనాలు నడిపే సమయంలో అన్ని డాక్యుమెంట్స్ తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు.

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

శుభలేఖ సుధాకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఎర్రయ్య

ఎర్రయ్యకు సంగీత కళా నందీశ్వర పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన సాక్సోఫోన్ విద్వాంసులు అసనాపురం ఎర్రయ్య 'సంగీత కళా నందీశ్వర' పురస్కారం అందుకున్నారు. సోమవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ విజయవాడ, లద్దికోట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీ వాగ్దేవి వాయిద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ 5000 మంది కళాకారులతో నిర్వహించిన 'స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం-2025' కార్యక్రమానికి తాను అతిథిగా హాజరయ్యానని చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు తనకు ప్రముఖ సినీ కళాకారులు శుభలేఖ సుధాకర్ చేతుల మీదుగా 'సంగీత కళా నందీశ్వర' అవార్డును ప్రదానం చేశారని చెప్పారు. తాను ఎందరో పేద విద్యార్థులకు ఉచితంగా సంగీత విద్యను నేర్పడమే కాకుండా, ఆల్ ఇండియా రేడియో ఏ గ్రేడ్ఆర్టిస్టుగా, శ్రీ కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వంసలుగా కూడా వ్యవహరిస్తున్నాని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ఎన్నో ఆస్థాన మండపాల్లో సాక్సోఫోన్ కచేరీలు కూడా చేశానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వాగ్దేవి వాయిద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ సంస్థాపకులు నాగేంద్ర యాదవ్, ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంఘం చైర్మన్ ఎల్లమంద రావు, గాజువాక ఎమ్మెల్యే, ఆల్ ఇండియా నాదస్వర సంఘం అధ్యక్షులు వి.సత్యనారాయణ, డోలు విద్వాంసుడు మునిరత్నం పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జిల్లాలో ప్రజల భద్రత కోసం పోలీసులు చేపట్టిన విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం మరింత బలోపేతం అవుతోందని సిఐ గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీలు, రాత్రి పహారాలు, చెక్ పోస్టుల వద్ద కఠిన తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి, నిషేధిత వస్తువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రోడ్డు భద్రతపై కూడా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా వాడాలని చెప్పారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ కఠినంగా నిషేధించామని తెలిపారు. ఆటోలలో ఎక్కువ మందిని ఎక్కించుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటూ, భద్రతకు భరోసానిస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రైతులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ, ఇఫ్కో సహకార సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జి.శివన్నారాయణ మాట్లాడుతూ రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు, జీవన ఎరువులు వాడవాలని సూచించారు. అధిక యూరియా వాడకం వలన పర్యావరణంపై కలిగే నష్టాలను వివరించారు. ఇఫ్కో జిల్లా అధికారి రైతులకు నానో యూరియా, నానో డిఎపి వాడు విధానాన్ని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ మండలంలో అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేసామని తెలిపారు. అవసరం మేరకు యూరియాను రెండు రోజుల్లో ఇస్తామని తెలిపారు.

కెవికెలో మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా కెవికె, జిల్లాలోని వివిధ గ్రామాలలో డాక్టర్ కె.మంజుల, కెవికె సమన్వయకర్త, ఇతర శాస్త్రవేత్తలు రకరకాల పారిశుద్ధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కెవికెలోని సిబ్బంది అందరూ స్వచ్ఛతా హి సేవ, స్వచ్ఛాంద్ర గురించి ప్రతిజ్ఞ చేశారు. కెవికెలోని నిల్వ గాదులను, గోడౌన్స్‌ను శుభ్రం చేశారు. గ్రామాల్లోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లో వయ్యారిభామ కలుపు మొక్క వలన కలిగే నష్టాలను మరియు నివారణ మార్గాలను వివరించారు. ప్రజలకు వ్యర్థాల నిర్వహణ, చెట్లు నాటే కార్యక్రమం, ఆరోగ్య పరిరక్షణపై చర్చ కార్యక్రమాలు నడిపారు. వ్యవసాయ కళాశాల, తిరుపతి నుంచి కెవికె సహకారంతో గ్రామీణ అనుభవ కార్యక్రమాన్ని అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత-ఆవశ్యకత గురించి వివరించారు. వివిధ సేంద్రియ పద్ధతుల్లో వరి, వేరుశనగ, కూరగాయలను ప్రయోగాత్మకంగా పండిస్తూ, రైతులను కూడా సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తున్నారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - నందలూరు

దేశం అభివృద్ధి చెందడానికి ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు అనేక కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తారని ప్రిన్సిపల్ శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం అరుంధతివాడలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.నీలవేణి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడం డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను పాటించడం వంటి లక్షణాలు విద్యార్థులకు అలవడి ఉత్తమ పౌరులుగా రూపు దిద్దుకుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, పరిసరాలను పరిచారు. కార్యక్రమంలో అధ్యాపకులు వసంతరావు, వెంకటేశ్వర్లు, అన్నమాచార్య కళాశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పల్లపు. బుజ్జమ్మ భర్త పల్లపు. వెంకట రమణ కమ్మరపల్లి నూలివీడు గ్రామం గాలివీడు మండలం అన్నమయ్య జిల్లాకు చెందిన పల్లపు. బుజ్జమ్మకు చెందిన పాస్పోర్టు గాలి వేడుకు బస్సులో వస్తుండగా బస్సులో పర్సు మిస్ కావడంతో పర్స్‌లో ఉన్న పాస్పోర్ట్ తప్పిపోయినది ఎవరైనా సమాచారము అందిన వారు ఈ క్రింది నెంబర్కు సమాచారాన్ని ఇవ్వగలరు.

సెల్ నెంబర్ : 9502235446.

కడప టిడిపిలో లుకలుకలు!

- ఎమ్మెల్యేపై ద్వితీయ శ్రేణి తిరుగుబాటు
- మంచిబుద్ధిని ప్రసాదించాలని దేవునికడపలో ప్రార్థనలు
- టిడిపి సీనియర్ నేత 'పుత్తా' వద్దకు అసంతృప్తులు

పుత్తాకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి అసంతృప్తి నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప టిడిపిలో అసమ్మతి భగ్గుమంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డిపై స్వపక్ష, మిత్రపక్షాల నుంచి అసంతృప్తుల జడివాన కురుస్తోంది. ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఏళ్ల తరబడి జెండా మోసిన సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం చేయడం, అర్హులైన కార్యకర్తలకు కాంట్రాక్టు పనుల కేటాయింపుల్లో మొండిచేయి చూపించడం వంటి చేష్టలపై కేడర్ నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సోమవారం టిడిపి సీనియర్ నాయకులు పాతకడప కృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డిలతో కూడిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ దేవుని కడప ఆలయంలో ప్రార్థనలు చేయడంతో అసంతృప్తి పతాక స్థాయికి చేరుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్.మాధవిని గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డిన తమను కాదని, ఎన్నికల అనంతరం తమ ఆస్తులను కాపాడుకోవ డానికి వ్యూహాత్మకంగా టిడిపిలో చేరిన ఎనిమిది మంది వైసిపి కార్పొరేటర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని నిలదీస్తున్న వైనం ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల్లో స్వపక్షం నుంచే అసంతృప్తి

సార్వత్రిక ఎన్నికల ప్రచార దశ నుంచే కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డి వ్యవహార సరళిపై అసమ్మతి బుసలు కొడుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు, దుర్గాప్రసాద్ వంటి సీనియర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైన సంగతి తెలిసిందే. అసమ్మతిని లెక్క చేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించి గట్టెక్కారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన 15 నెలల అనంతరం తాజాగా పాత కడపకు చెందిన టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి బృందాల నుంచి ఎదురైన తీవ్ర వ్యతిరేకత కలకలం రేపుతోంది.

మిత్రపక్షంలోనూ అసమ్మతే

జిజిహెచ్ డైరెక్టర్లు, న్యాయస్థానాల్లో ఏకపక్ష నియామకాలపై కూటమి నాయకుల్లో అసంతృప్తి బుసలు కొట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర కేబినెట్‌లో బిజెపికి చెందిన వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ శాఖలో చొరబడి ఏకపక్ష నియామకాలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి కడప నాయకుల వైఖరిపై కూటమి రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. స్వపక్షం, మిత్రపక్షమనే బేధం లేకుండా అసంతృప్తుల జడివాన కురుస్తుండడం గమనార్హం.

టిడిపి సీనియర్ నాయకులు 'పుత్తా'కు వినతి

దేవునికడప ఆలయంలో టిడిపి తిరుగుబాటు నాయకులు ఎమ్మెల్యేకు మంచిబుద్ధిని ప్రసాదించాలని ప్రార్థనలు చేయడం అందరిదృష్టినీ ఆకర్షించింది. ప్రార్థనల అనంతరం కమలాపురం టిడిపి సీనియర్ నాయకులు పుత్తా నరసింహారెడ్డిని కలిసి టిడిపి కేడర్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను వివరించడం చర్చనీయాంశంగా మారింది.

దానిమ్మ దిగుబడి బాగున్నా.. ధర లేదన్నా..!

టన్ను రూ.60 వేలలోపే - పెట్టుబడులు కూడా రాలేదంటున్న రైతులు - గిట్టుబాటు ధర కోసం ఎదురుచూపులు

సాగులో ఉన్న దానిమ్మ పంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దానిమ్మ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నానాటికీ తగ్గుతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నెలరోజుల క్రితం ఉన్న ధరలు అమాంతం తగ్గి సగానికి పడిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీసం పెట్టుబడులైనా వస్తాయా.. రావా.. అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే దానిమ్మ ధరలు సగం పైగానే తగ్గిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలో చీనీ పంటకు తెగులు సోకి అధికంగా చెట్లు ఎండిపోతుండడంతో చాలామంది రైతులు దానిమ్మ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. లింగాల, పులివెందుల మండలాల్లో దానిమ్మ ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో పంట సాగులో ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గతంలో ధరలు ఎక్కువగా ఉండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది ధరలు తగ్గుముఖం పట్టడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టన్ను రూ.60వేలలోపే..

ఎకరా దానిమ్మ సాగుకు రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభై వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. దిగుబడి బాగానే వచ్చింది. టన్ను ధర ప్రస్తుతం రూ.60వేలలోపే పలుకుతోంది. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి. సరిగ్గా ఏడాది క్రితం దానిమ్మ టన్ను ధర రూ.1.20 లక్షలు పలికి రైతులకు సిరులు కురిపించింది. ఈసారి కూడా ధరలు బాగుంటాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది.

ఇతర రాష్ట్రాల్లో మంచి దిగుబడులు..

ఇతర రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఎపిలో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు నుంచి అయినా ధరలు పెరుగకపోతాయా అన్న ఆశతో రైతులు ఉన్నారు. అప్పుడు కూడా ధరలు పెరగకపోతే నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానిమ్మ కాయలను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చెన్నయ్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పంట ఎక్కువగా వస్తుండడంతో తెలంగాణ, చెన్నయ్‌కి నామమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు..

దానిమ్మ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా రాదు. ఎకరాకు పెట్టుబడి రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభై వేల వరకు వచ్చింది. దిగుబడి బాగున్నా.. ధరలు తగ్గడం కలవరపెడుతోంది. నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రానున్న రోజుల్లోనైనా ధరలు పెరిగితే కొంత ఉపశమనం దక్కుతుంది.

- కృష్ణారెడ్డి, రైతు, పులివెందుల

ప్రస్తుత ధరలతో నష్టమే..

దానిమ్మ ధరలు తగ్గడంతో పంటను అమ్ముకోలేకున్నాం. కొన్నిచోట్ల పంట కోత దశకు రావడంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. ఏడెకరాల్లో పంట సాగుచేశా. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే దానిమ్మ కాయలు దెబ్బతిని మొదటికే మోసం వచ్చే ప్రమదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు.

- మదన్ మోహన్‌రెడ్డి, రైతు, లింగాల

అట్టహాసంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలో శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 'దసరా ఉత్సవాలు' సోమవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి చిత్రపటాన్ని108 వెండి కలశాలతో పాలు ఉంచి సంప్రదాయబద్ధంగా పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారిశాలలో నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పాలాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, మంగళ హారతులు, దర్శనం తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. **నందలూరు** :మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు దీక్షా బంధన అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం, నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఉదయదారులుగా ఎంబలూరు నరసింహ ప్రసాద్ దంపతులు, మాకం వెంకట కుమార్ దంపతులు, రజం రామకృష్ణయ్య దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరిలోని సోమేశ్వరాలయం గ్రామదేవత ఎల్లమ్మ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమేశ్వర, ఎల్లమ్మ ఆలయ చైర్మన్లు పుల్లారెడ్డి, రెడ్డివారి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాలను వివిధ రకాలైన పూలు, విద్యుత్ ద్వీపాలతో అలంకరించి ఆలయాదన్న సుందరంగా తీర్చిదిద్దారు. **వాల్మీకిపురం:** మండలంలోని గండబోయనపల్లి కోటలో శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీ సత్యమ్మ తల్లి బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించడంతో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉభయదారులు పులి సత్యనారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సద్దల చక్రపాణి, శ్రీకాంత్ రెడ్డి, పులి నారాయణ రెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** పట్టణంలో వెలసిన శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు అమ్మవారు అర్ధనాధీశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అక్టోబర్ 3 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పూనగంటి ఓం ప్రకాష్ తెలిపారు. ఇందులో భాగంగా రోజూ ఆలయంలో విశేష అలంకారంతో ప్రాకారోత్సవం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. దసరా నవరాత్రుల్లో రోజూ రాత్రి 8 గంటలకు అల్పాహారంఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. **పీలేరు :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో వెలిసిన శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ మొదటి రోజు భక్తులకు బాలత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం. అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నెహ్రూబజారులోని శ్రీ కన్యకాపరవేశ్వరి అమ్మవారు వాసవిదేవి అలంకారంలో మొదటి రోజు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని శ్రీ యల్లమ్మ తల్లికి, తలుపుల పంచాయితీ, ఉలవల గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ గుడికి వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాతలు పెట్టి పూత రాసినట్లుంది జిఎస్‌టిపై మోడీ వైఖరి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలకు వాతలు పెట్టి పూత(ఆయింట్‌మెంట్) రాసినట్లుంది జిఎస్‌టిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వైఖరి అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఎస్‌టి ప్రజలపై గబ్బర్‌సింగ్ టాక్స్‌గా తయారైందన్నారు. ప్రజలపై విపరీతమైన పన్నుల భారం పడిందన్నారు. ప్రస్తుతం ఉన్న 5,12,18,28 స్లాబులను రద్దుచేసి ఒకే స్లాబ్ చేయాలని, అదీ కూడా ఐదు శాతం స్లాబ్ ఉండాలని చెప్పారు. పెట్రోల్, డీజిల్ కూడా జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ మొదటి నుండి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఎనిమిదేళ్లుగా జిఎస్‌టి నాలుగు స్లాబుల ద్వారా ప్రజలను మోడీ ప్రభుత్వం పీల్చి పిప్పి చేసిందన్నారు. ఇప్పుడేమో నాలుగు స్లాబులను రెండు స్లాబ్ చేసి అదేదో పెద్ద ఘనకారమైనట్లు పండగ చేసుకోండి అని ప్రజలకు మోడీ చెప్పడం చాలా హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 5,18 స్లాబుల స్థానంలో 18 స్లాబ్ తొలగించి కేవలం ఐదు స్లాబ్‌నే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోలు, డీజిల్ కూడా జిఎస్‌టి పరిధిలోకి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అప్పుడే ప్రజలకు నిజమైన పండుగని తులసిరెడ్డి పేర్కొన్నారు.

వేణుగోపాల్ రెడ్డి హత్య దారుణం..

ప్రొద్దుటూరుకు చెందిన వడ్డీ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డిని కిడ్నాప్, హత్య చేసి కుందూనదిలో పడవేయడం చాలా దారుణమని తులసిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయనడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వట్టి మాటలు కట్టిపెట్టి శాంతి భద్రతలపై ప్రత్యేకదృష్టి సారించాలని కోరారు.

ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

సబ్ జైలులో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనలతో కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సోమవారం రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలిని తెలిపారు. జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలిన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి దుకాణాల అద్దెలపై జిఎస్‌టి అన్యాయం

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి బస్టాండ్ సముదాయాల్లోని దుకాణదారుల నుంచి అద్దెతో పాటు ప్రతినెలా 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌సి) వసూలు చేయడం అన్యాయమని పీలేరు మండల ఆర్‌టిసి బస్టాండ్ అద్దెదారులు, బడుగు బలహీన వర్గాల కన్వీనర్ పసుపులేటి వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణాల్లో పేదలు, నిరుద్యోగులు చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కూలి పనులు దొరకని వారు, విద్యావంతులైన నిరుద్యోగులు కొద్దిపాటి మూలధనంతో జీవనోపాధి కోసం దుకాణాలు నడుపుకుంటున్న వ్యాపారులపై అదనపు జీఎస్టీ భారం మోపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రతి టెండర్ దారుడు బస్టాండ్‌లో దుకాణం అద్దెకు తీసుకునేటప్పుడు దరఖాస్తు ఫీజు, టెండర్ అమౌంట్‌తో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిఎస్‌టి చెల్లిస్తున్నాడని, అయినప్పటికీ తిరిగి నెలవారి అద్దెపై అదనంగా 18 శాతం జిఎస్‌టి వసూలు చేయడం వ్యాపారులకు భారంగా మారిందని స్పష్టం చేశారు. తాజాగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ 99 శాతం వస్తువులపై 5 శాతం మాత్రమే జిఎస్‌టి విధింపును అమలు చేస్తున్నారని, ఆర్టీసీ అద్దెలపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ అధికారులు కూడా ఈ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు.

చెరువును కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ భూమిని మరియు చెరువును దురాక్రమణ నుండి కాపాడాలని వై.వెంకటేశ్వరరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో భాగంగా చెరువు ఆక్రమణపై ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. మండలంలోని గుండ్లూరు గ్రామం గల్లావారిపల్లిలో ఉన్న చిన్న అయిలకుంట (ఎగుద ఆయిల్ కుంట) ఉందన్నారు. కుంటలోకి గతనెలలో కురిసిన వర్షానికి నీరు చేరిందని, ఆ గుంట కింది ఎ.సుబ్బయ్య ప్రభుత్వ చెరువు భూమిని ఆక్రమించి టమోటా సాగు చేసినాడని, పేర్కొన్నారు. ఆపంట దెబ్బతింటుందని జెసిబి సహాయంతో చెరువు మరవను లోతుగా కాలువ తీసి నీరును వదిలేసారని చెప్పారు. కలికిరి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ చెరువు విస్తీర్ణాన్ని కొలిచి చుట్టుపక్కల ట్రెంచ్ కొట్టవలసిందిగా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షులుగా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె పంచాయతీ చెరువుముందరపల్లెకు చెందిన నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి బెంగళూరు రూరల్ జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షులుగా నియమితులయ్యారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి సోమవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. మల్లికార్జునరెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గం, బెంగళూరులో పలు సమాజ సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందారు.

3న గండిలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో టెంకాయలు అమ్ముకొనుటకు అక్టోబర్ 3న ఇ టెండర్, సీల్డ్ టెండర్, బహి రంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఇఒ జె.వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలి పారు. కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ ఉత్తర్వులు మేరకు లోబడి వేలం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. వేలం పాటలో హిందూ మతస్తులు మాత్రమే పాల్గొనాలన్నారు. పాల్గొనేవారు రూ.10 లక్షలు డిపాజిట్ చెల్లిం చాల్సి ఉందన్నారు. హెచ్చు పాట దారుడు వేలం ముగిసిన వెంటనే మొత్తంలో డిపాజిట్‌తో కలిపి 50 శాతం చెల్లించాలన్నారు. మిగతా 50 శాతం కమిషనర్ దేవాలయ శాఖ విజయవాడ వారి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే లేదా మూడు నెలలు కాల వ్యవధిలో చెల్లించాలని వివరించారు. పై తెలిపిన హక్కును నిలుపు దల చేయుటకు, వాయిదా వేయుటకు కార్యనిర్వహణాధికారికి పూర్తిగా అధికారం ఉందన్నారు.

రికార్డులు సక్రమంగా ఉన్నాయి : డిటిఎఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయంలో మూడు రోజులుగా వార్షిక తనిఖీలు జరుగుతున్నాయి. డిటిఎఒ జయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహిస్తున్నారు. 2024-25 ఏడాదికి సంబంధించిన అన్ని రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేసినట్టు ఆమె చెప్పారు. రికార్డులు బాగా మెయింటైన్ చేస్తున్నారని కార్యాలయ ఎస్‌టిఒ, సిబ్బందిని అభినందించారు. తనిఖీ బృందంలో ఎస్‌టిఒ రామాంజినేయులు, ఎస్ఎ నంద్ బాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై కోలాట బృందం సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు అమ్మవారికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణ చేశారు. పిటిఎంకు చెందిన శ్రీలక్ష్మీ సరస్వతి కోలాట బృందం అమ్మవారి ముందు నాట్యం చేస్తూ పొలాలలో కోలాటం నిర్వహించారు. ఈ కోలహర కార్యక్రమంలో హర్షిత, రోజా, రవణమ్మ గురువులు హరిబాబు పాల్గొన్నారు.

కోలాట బృందం సభ్యులు